“కొంతమంది పుట్టుకతోనే అఖండ మయిన తెలివితేటల్తో పుట్తారు! ఆ కొంతమందిలో చాలామంది, కొంత వయస్సు మీదపడేసరికి వాళ్ళు మేదకులుగా తయారవుతారు. ఆ అవకాశం వుంది. కొంతమంది పుట్టటం మేదకులుగా పుట్తారు.



# జనరంజని

## పాలడుగు వెంకటేశ్వరరావు

“ఏ పుట్టలో ఏపాముందో అన్నట్లుగా, ఏ బుర్రలో ఏ అఖండమయిన తెలివితేటలు నిక్షిప్తమయివున్నాయో మనకి తెలియదు. వజ్రానికి కమ్మిన దుమ్ము తొలగిపోయినట్లూ, నిప్పుని కమ్మిన నివురు ఎగిరిపోయినట్లూ—ఆ మేదకులే, ఒక శుభగడియలో మొదలు పెట్టి, అఖండమయిన తెలివితేటల్ని ప్రదర్శించటం ప్రారంభించి పుష్కలంగా పేరుప్రతిష్టల్నీ—వాటితో పాటు ధనాన్నీ సంపాదించి ఒకవెలుగు వెలుగుతారు”—అంతవరకూ చెప్పి, ఆగి, సిగరెట్ వెలిగించుకున్నాడు విలాసరావు. నావంక ఓరగా చూసాడు.

“నువ్వు ఎవరిగురించి ఇదంతా చెపుతున్నావో నాకు అర్థంకావటం లేదు” అన్నాను నేను అర్థంకానట్లు మొహం పెట్టి.

“అర్థం అవుతుంది—కాస్త ఓపికపట్టు” అని చిద్విలాసంగా నవ్వి సిగరెట్ పీల్చి ముక్కుల్నించి పొగని రింగురింగులుగా వదిలాడు విలాసరావు విలాసంగా.

“మనం డబ్బుతో డబ్బుని సంపాదించవచ్చును.” అని ఆగి ఓరగా చూసాడు మళ్ళీ.

“అది అందరూ ఎరిగినదే గదా?” అన్నాను నేను.

నన్ను ఆగమన్నట్లు అసహనంగా తలాడించాడు విలాసరావు. నేను నోర్మూసుకున్నాను.

“ఈ మధ్యన నాకు ఏరియర్సుపదివేలదాకా వచ్చాయి. వాట్ని నమ్మకస్తుడయిన ఒక వ్యక్తి దగ్గర మదుపు చేయగా—నాకు వాటిమీద నెలకి సుమారు అయిదు వందల రూపాయలదాకా ఆదాయం వస్తూంది. నెలనెలా అలాగ అయిదువందల చొప్పున గత మూడునెలల నుండి అందుకుంటూ—ఇటీవలనే ఆ వ్యక్తి దగ్గర నుంచి ఒక కలర్ టీ.వీ. సెట్టు పుచ్చుకున్నాను. ఎలాగో తెలుసా? నాకు తెలిసిన మిత్రులద్వారా నా మిత్రుడ యిన ఆ వ్యక్తి ప్రారంభించిన ఆ సంస్థలో ఈ మధ్యకాలంలో సుమారు రెండు లక్షల రూపాయిలు మదుపు చేయించాను. ఆ సంస్థ వ్యాపారాభివృద్ధికి నేనందించబోయే సహకారానికి ప్రతిగా ఇది గాక నాకు నెలనెలా మరికొంత ప్రతిఫలం అందుతూవుంది.” ఆనందంగా మందహాసం చేసాడు విలాసరావు.

“నీయొక్క నాకు తెలీని ఆ మిత్రుడు ఎవరూ? ఏమిటా సంస్థా? అది సాగిస్తూవున్న వ్యాపారం ఏమిటి?” అని నేను అడుగగా నావంక ఒక చూపు చూసాడు విలాసరావు. ఆ చూపులో ఎన్నో అర్థాలున్నాయి.

“ఈ ప్రపంచకంలోని దుఃఖభాగుల జాబితాలో, నిత్య శంకితుల్ని కూడా విష్వాసీగా చేర్చాడు చిన్నయ సూరి. అది నీకు తెలియదని నేననుకోను.” అన్నాడు విలాసరావు.

నేను చిన్నపుచ్చుకున్నాను.

“అలా మొహం పెట్టకు. నేను చూడలేను. ఏదో జోకేశాను. లైట్‌గా తీసుకో. సరే. నీ ప్రశ్నలకి సమాధానాలు ఇవీ. ఆ సంస్థపేరు జనరంజని. అది చేసే వ్యాపారం మద్రాసూ, బొంబాయి, కలకత్తా, వైజాగుల్లోని పెద్దపెద్ద ఎక్స్‌పోర్టు అండ్ ఇంపోర్టు కంపెనీలకి ఫైనాన్సు చేయటం. వ్యాపారాల్లోని జంత్రీమంత్రీలు నాకు అంతగా తెలీవు—గాని డబ్బుతో చాలా మేజిక్కులు జరుగుతాయని, ఆ కారణంగానే మన జనరంజని తన ఖాతాదారులకి విపరీతమయిన లాభాల్ని ముట్టజెప్ప గల్గుతూవుందనీ—మన వెంకట్రావు నాకు చెప్పాడు. నేను వెంకట్రావు గురించే మొదట నీతో అలా చెప్పబోయింది.”

“ఎవరూ? మన పిచ్చి వెంకట్రావా?!”

“పిచ్చెంకట్రావు కాదు. మేధావి వెంకట్రావు అనాలి ఇప్పుడు. కరక్టు యువర్సెల్ఫ్”

“ఎలా అనగలవు? ఆ సంగతి చెప్పు.”

మరలా విలాసరావు విలాసంగా నవ్వాడు “కొన్నాళ్ళ క్రితం వరకూ అమాయకంగా గడ్డాలు పెంచి మనవెనకనే తిరిగిన వెంకట్రావు, ఇప్పుడు ఏ స్టేజిలో వున్నాడో నీకు తెలీదు. ఇదివరకటి పిరికితనం, అమాయికత్వం మచ్చుకి కూడా ఆ మనిషిలో కానరావు—అనర్గళంగా కబుర్లు చెప్తాడు. ఎంతటివాడికయినా, ఎటువంటి జటిల విషయాన్నయినా అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లు విడమరిచి చెప్పగలడు అతను. అందుకే అన్నాను. కొన్నేళ్ళు మట్టిలో మాణిక్యంలాగా మేదకుడిలాగా జీవించి, ఇటీవల ఆ మట్టి కరిగిపోగా, అఖండంగా వెలుగుతూవున్న మేధావి మన వెంకట్రావు. మురికి బట్టలు పోయి సిల్కుబట్టలూ సెంట్లూ వచ్చాయి. సైకిలు పోయి స్కూటరు వచ్చింది. అతిత్వరలో కారు కొంటున్నాడట. ఇరుకు కొంపనించి, రెండువేల రూపాయిలు ఇచ్చే అద్దె బంగళాకి మారాడు. గాడిద చాకిరీ వుద్యోగాన్ని ఒక్కతన్ను తన్ని రిజయిన్ చేసాడు. ఎప్పుడూ మద్రాసూ, బొంబే టూర్లు! వూళ్ళో వున్న నాలుగురోజులూ పెద్దలతో పార్టీలు. ఓహ్! ఏం చెప్ప

మంటావు మన వెంకట్రావు వైభవం! అతన్ని పిచ్చి వెంకట్రావు అనటానికి నీకు నోరెలా వచ్చిందిరా?" అని నావంక జాలిగా చూసాడు విలాసరావు.

"అలాగా! ఐతే సారీరా." అన్నాను నిజంగానే విచారించి.

"ఫర్లేదులే, నాదగ్గర అంటే అన్నావు ఇంకెక్కడా అలా అనకు; దెబ్బతింటావు."

"అలాగే! తెలిసింది గదా."

"ఇంతకీ ఈరోజు నీదగ్గరకి పనిగట్టుకుని, నేను ఎందుకు వచ్చానో నీవు అడగకపోయినా నీకు చెప్పవలసిన బాధ్యత నామీదవుంది. నీ మంచిని కోరిన స్నేహితుడ్ని గనుకా నీకు వుపకారం చెయ్యాలని పనిగట్టుకొని వచ్చాను. రోజురోజుకీ పెరిగిపోతూవున్న ఈ ధరవరల్తో, చాలీచాలని జీతానాతాలతో, అనునిత్యమూ సతమత మవుతూ వున్న మనలాంటి వాళ్ళు ఏదో వీలునిబట్టి ఇటూంటి ఏర్పాటు ఏదో చేసుకుంటే, అవసరానికి డబ్బు లాక్షించి పెట్టి, సంసారాన్ని ఆనంద ప్రదంగా నడుపుతుంది. శ్రీమతికి నీరెలు కావాలన్నా, పిల్లల సర్దాలు తీరాలన్నా, మన విలాసాలు నెరవేరాలన్నా— ఇటువంటి సకనిర్పాటు మనం చేసుకుంటే బాగుంటుం దని నావుద్దేశ్యం. ఏమంటావ్? "

నేను ఆలోచనలో పడ్డాను.

"ఒరే! దీనికింత ఆలోచన అనవసరం. మనం మను షుల్ని నమ్మాలి. మానుల్ని నమ్మమని ఎవరూ అనటం లేదుగదా! నిన్న నువ్వు సుమారు ఎనిమిదివేల దాకా ఎరియర్సు అందుకున్నావని తెలిసింది. డబ్బుదేముంది! చూస్తూవుండగానే ఇట్టే కరిగిపోతుంది. అందువలన మనం ముందే జాగ్రత్తపడి..."

"సారీ విలాసరావు, నాకు ఇటువంటి వాటిమీద మోజులేదు. పైగా పైనెలలో మా అమ్మాయి పెళ్ళి తలపెట్టుకున్నానుగదా! అందువలన మీ జనరంజనిలో నేను నాడబ్బు దాచుకుని లాభాలు అందుకోలేను. నాకా ప్రాప్తం లేదు." అన్నాను నవ్వి.

విలాసరావు నావంక అదోకలా చూసి "నేను చెప్పాను గదా! నువు అనుమానస్తుడివి. నీవంటివాళ్ళు పైకి రమ్మంటే ఎలా రాగలరు? రాలేరు. నాకు తెలుసు." అని విసురుగా లేచి పోయాడు మొహం కందగడ్డలాగా చేసుకుని.

ఆ తర్వాత నేను సెలవు పెట్టి మా అమ్మాయి వివాహం కోసం రెండుమూడు నెలలు గ్రామాంత రంలో గడిపి—తిరిగి డ్యూటీలో జాయినయాను. ఒక రోజు సెంటర్లో వప్పట్లు కొట్టి పిలిచి పలకరించాడు. అతను. లోతుకు పోయిన ఎర్రని కనులూ, మాసిన గడ్డమూ, బక్కచిక్కిన శరీరమూ గల ఆ శాల్తీని విలాసరావుగా గుర్తించటానికి నాకు అయిదు నిముషాలు పట్టింది. అంతగా మారిపోయాడు.

"ఒరే! నీమాట విన్నాను కాదు. పైగా నిన్ను నిందించాను. నన్ను క్షమించరా." అన్నాడు దిగులుగా విలాసరావు. అతనిగొంతు గద్గదికంగా వుంది. ఏడుపే తక్కువ.

"విలాసరావు! ఏం జరిగింది? ఎందుకలాగ అయి

## ఆశ్చర్యమెందుకు

మినుకుతున్న దివ్వే<br>
పొడుస్తున్న పొద్దూ<br>
కలబడితే<br>
వెలుతురు నవ్వగిలింది కాదా<br>
అద్వైతం బొద్ధం కుస్తీలో<br>
మనమకి తమసం<br>
మనిషికి మతిలేగా<br>
మిగులు<br>
బతుకులోని వచ్చి నిజంలో<br>
అతుక్కోని అహింస<br>
పోటీపడితే<br>
అతడి పాలిట హాజమూ హింసామా<br>
మాత్రమే అయితే

\- ఛిప్కో

పోయావు?!" అన్నాను.

"ఆ వెంకట్రావుగాడు కొంప ముంచాడురా! బోర్డు లేపేసి వుడాయించాడు."

"అయ్యో! అలాగా!"

"డాం డర్టీ రాస్కెల్!—అవును. ఆ జనరంజని నాకొంప ముంచింది. నా ఎరియర్సు పదివేలూ అన్యా యంగా కాళ్ళువచ్చి నడిచిపోయేయి. నేను మునగటమే గాక, ఆ వెంకట్రావుని నమ్మి, నాకు తెలిసిన నలుగుర్నీ ముంచాను. నలుగుర్లోనూ అప్రదిష్టపాలయి జైల్లో కూడా కూర్చునొచ్చాను."

"ఇంతకీ ఏమయింది? అసలు ఏమిజరిగిందీ?"

"నీకు తెలీదుగా! ఆ కంపెనీ వెంకట్రావుగాడూ, వాళ్ళ బావమర్దీ కలిసి పెట్టారట."

"ఆ"

"వాళ్ళు—ఇలాగ బహుమతులు ఇచ్చి, ఆకర్షణీయ మైన వడ్డీలు ముట్టజెప్పి—జనాన్నుంచి డబ్బుపోగేసారట. నాలుగయిదునెలలు చూసీ వాడి కళ్ళు జిగేల్మనిపించే లాగా—వళ్ళు ఆశాపాశంలో చిక్కుకుని జివ్వున పులక రించేలాగా అలాగ నడిపి, ఆకర్ష జనం డబ్బు పుచ్చుకుని, బోర్డు ఎత్తేసి పరారీ అయ్యారు. అదీ జరిగిన సంగతి" అని నిట్టూర్చాడు విలాసరావు.

"మరి వెంకట్రావునడిగితే ఏమంటాడు?"

"ఆ వెధవని గొడ్డుని బాదినట్టు పట్టుకుని బాదాం. ఏంలాభం? ఇన్‌కంటాక్సువాళ్ళు పట్టుకుంటారని భయ పడి—వాడూ ఆ డబ్బంతా ఆ బావమర్ది పేరునే వుంచాడట! వాడు అసలు ఎక్కడా ఈ జనరంజని ట్రాన్స్‌యాక్షన్స్‌లో తను కమిట్ కాలేదు. కానీ, చాపక్రింద నీరులాగా వాడు ఆ డబ్బంతా పట్టుకెళ్ళి పెళ్ళాం పేరున రాంచంద్రాపురంలో ఒక్క పాత సినిమా హాలు కొనుక్కుని, నడుపుకుంటున్నాడట. వాడి దగ్గరకి వెళ్ళి అడిగితే—'నాకేం సంబంధం లేదు. ఏదో చుట్టపు చూపుగా మా బావదగ్గరకి వచ్చేవాణ్ణి ఆ రోజుల్లో. అంతేగాని నాకేం తెలుసు? అదేదో మీరూమీరూ తేల్చు కోండి.' అన్నాడు లవుకికంగా. ఇంకా—వాడికి ఏవో వ్యాపారాలు లవీ వున్నాయిట. అందువలన దేబిముఖాలు పెట్టుకుని తిరిగివచ్చి వెంకట్రావుగాడి మీద కేసెట్టి జైలుకి పంపించాను. నన్నూ పంపించారు. ఒరే! ఆశ అన్నది మనిషని వెడగొట్టుతుందిరా! తృప్తిలేని మానవుడికి శాంతి ఎక్కడిదీ? అత్యాశకి పోయి పరుగులు పెడితే కాళ్ళు విరిగి నాలాగానే అవుతార్రా ఎవరయినా!" అని కళ్ళు తుడుచుకున్నాడు విలాసరావు.

"వెంకట్రావు నమ్మించి మోసం చేసాడు! ఎంత అన్యాయం?!"

ఈ ప్రపంచంలో ఆశపోతులు, అమాయకులు వున్నంతవరకూ మోసాలు జరుగుతూనే వుంటాయి. లాభం అంటే ఏమిటీ? మరొకడికి నష్టం జరిగితే అందువలన మనం లబ్ధిపొందితే, మనం లాభించినట్లు.

"జైలు నుండి విడుదలయాక వెంకట్రావు మళ్ళీ రాంచంద్రపురం వెళ్ళి బావమర్దితో ఆ సినిమాహాలు పంచుకుంటాడన్నమాట!" అన్నాను.

"వాడి బొంద! పిచ్చివెధవ!' వీడు జైల్లో పడక ముందు పారిపోయి దేశాలు తిరుగుతూ, బావమరిది పంచన చేరి ఆ మాటే అనగా,'బావా! పొరపాట్నయినా అటువంటి జోకులు వెయ్యకు. కావాలంటే మా వూరు వచ్చినప్పుడల్లా మన హాల్లో ఫ్రీగా సినిమా చూసిపో. కాదనను. అంత అభిమానం, మర్యాదా లేని మనిషిని కానునేను. కానీ, నువ్వు నీ బుర్రనివుపయోగించి నా సినిమాహాలునే భాగాలుగా విడగొట్టావంటే మాత్రం అవతల మీ చెల్లెలు చీపురుచ్చుకుంటుంది.' అని అతడు నిష్కర్షగా చెప్పగా దేబిముఖం పెట్టుకుని మరలా ఈ వూరు చేరి, చావుదెబ్బలు తిని—ఆ తర్వాత జైలుకి వెళ్ళాడు. కానీ ఏం లాభం!" అని నిట్టూర్చాడు విలాసరావు.

"అయితే—జనరంజనిని ఆరంభించిన మన వెంక ట్రావు—మేదకుడిగా కొన్నాళ్ళు జీవించి, ఆ తర్వాత ఉజ్జ్వలంగా ప్రకాశించి మేధావి వర్గానికి..."

"వాడిబొంద. పిచ్చివెధవ. మేమందరమున్నా పిచ్చి వెధవలమే. కానీ, వాడున్నాడే వాడి బామ్మరిది, వాడూ..."

"అయితే జనంనెత్తిన చేతులు పెట్టి డబ్బు పోగెయ్య టం, గటుక్కున మింగి గుడ్లు తేలేసి అమాయికంగా మొహం పెట్టటం, నీ దృష్టిలో..."

"కాదు కాదు మహానుభావా! అని నమస్కరించుకుంటు న్నాను. ఇకముందు నీదగ్గర ఇలాంటి సిద్ధాంతాలు ప్రతి పాదించవని కూడా అంటున్నాను. నా అవగాహనా రాహిత్యానికి లెంపలు వేసుకుంటున్నాను. సెలవు నాయనా వస్తా." అని విసురుగా వెళ్ళిన విలాసరావు వంక జాలిగా చూస్తూ నిలబడిపోయాను.